**తన బాగు చూసుకోవడంలో తప్పు లేకపోవచ్చు. కానీ, తన బాగు కోసం యితరుల్ని నష్టపరచాలని చూస్తే....!**

**అదొక నాలుగు చిన్న పోర్షన్ల లోగిలి. అందులో కింద రెండు, మేడమీద రెండూ రెండుగదుల ఇళ్ళున్నాయి. కిందవున్న రెండింట్లో, ఒక పోర్షన్ అద్దెకి తీసుకుని వుంటోంది డాక్టర్ రాజేశ్వరి. ఆమెకి తోడుగావుండి వంటచేసి పెడుతుంది ఒక అవ్వ, రాజేశ్వరికి దూరపు బంధువు.**

రాజేశ్వరి హైదరాబాదులో అయిదేళ్ళుగా గవర్న మెంటు డాక్టరుగా చేస్తోంది. పెళ్ళిచేసుకోవాలని కోరికవున్నా, అవకాశం కలిసిరాలేదు. డ్యూటీచేసి ఇంటికివస్తే, ఏ కబుర్లుచెప్పాలన్నా అవ్వతప్ప వేరే గతిలేదు. ఈ బోర్‌ని భరించలేక, ఏ వర్కింగ్ హాస్టల్లోనో ఉంటున్న, ఒక ఫ్రెండునో తెచ్చి తనదగ్గర ఉంచుకుందామని అనుకుంటున్న రోజుల్లోనే, గాయత్రి ఆమెకి తోడుగా దొరికింది.

గాయత్రి, రాజేశ్వరివాళ్ళ వూర్లో తమకి బాగా తెలిసినవారి అమ్మాయి. ఉద్యోగంచేయాలనే సరదాతో హైదరాబాదువచ్చి చేరింది. ఆమె అదృష్టంకొద్దీ వచ్చిన నెలరోజులకే తనకి ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం దొరికింది.

రాజేశ్వరీ, గాయత్రీ ఇద్దరూ అక్కచెల్లెళ్ళలాగా కలిసిపోయారు. అవ్వచేసిన వంటకాలు తినటం. ఉద్యోగాలు అయినాక సాయంకాలం ఇద్దరూ, ఏ షికారుకో, సినిమాకో వెళ్ళటం- సరదాగా గడిపేస్తున్నారు

రాజేశ్వరికి నైట్ డ్యూటీయో, ఎక్స్ట్రా వర్కో ఉన్నప్పుడు, తనకు పొద్దుపోయేందుకు గాయత్రికి ఆఫీసులోనే స్నేహితులు దొరికారు.

గాయత్రి ఇక్కడికొచ్చి గడుపుతున్న జీవితానికీ, ఊర్లో ఉండగా ఉంటున్న తీరుకీ ఏ మాత్రం పోలికలేదు. అదో పల్లే, పట్నంకాని ఊరు. ఏదో స్కూలుకీ, కాలేజీకి వెళ్ళి రావటంతో సరిపుచ్చుకోవాలి ఆడపిల్లలు. ఎప్పుడో మూడు నెలలకొకసారి ఇంటిల్లిపాదీ కలిసి ఒక సినిమా చూస్తారు. ఇక అమ్మాయిలు ఒంటరిగా స్నేహితురాళ్ళతో సినిమాలూ, షికార్లు వెళితే "అమ్మో! ఈ పిల్ల ఎంత తెగించిపోయిందో" అని అంతా ముక్కుమీద వేలేసుకుంటారని భయం

అసలు గాయత్రినిలా హైద్రాబాదుకి రానివ్వటం కూడా గొప్ప విషయమే.

# నిద్రపోని నిజం

ఆమె తండ్రి కాస్త పెద్ద ఉద్యోగమే చేసి రిటయిరయ్యేరు. ఆయనకిలాంటి చాదస్తాలంతగా లేవు. ఒక్కర్తే కూతురని కూతురుమీద చెప్పలేని ప్రేమ. పైగా ఇంట్లో నలుగురన్నలు. వదినెలు. వాళ్ళ పిల్లల మధ్య, కూతురు నలిగిపోతోందని ఆయనకి బాధ. దానికి తోడు గాయత్రి పోరు ఒకటి "నేను హైద్రాబాదెళ్ళి ఉద్యోగం చేస్తానో" అని.

**వింధ్యవాసిని**

ఎప్పుడో పదేళ్ళ క్రితం పోయిన రాజేశ్వరి తండ్రికీ గాయత్రి నాన్నకీ మంచి స్నేహం ఉండేది. అంతేకాకుండా రాజేశ్వరి అంటే ఆయనకొక మంచి అభిప్రాయం. మంచి బుద్ధిమంతురాలయిన పిల్ల అని. అందుకే ఆమె దగ్గర ఉంటే ఏం భయంలేదని స్వయంగా వచ్చి కూతుర్ని రాజేశ్వరి దగ్గర వదిలిపెట్టి వెళ్ళాడు.

వెళ్తూ, గాయత్రికి తెలియకుండా చేసిన పని ఒకటుంది. "అమ్మాయ్! దీనికి పెళ్ళి చేస్తే నా బాధ్యత తీరిపోతుంది. కాస్త ఇక్కడ నీ ఎరికలో స్నేహితుల్లో ఎవరయినా మంచి అబ్బాయుంటే చూసి నాకు జాబు రాయమ్మా," అని రహస్యంగా చెప్పిపోయాడు. అంత రహస్యంగా చెప్పటానికి కారణం లేకపోలేదు. గాయత్రికి యిప్పుడప్పుడే పెళ్ళాడాలని లేదు. పెళ్ళి మాట చెబితేనే "నా కొద్దు బాబూ!" అని గొడవ చేస్తుంది. ఆ మాటకూడా చెప్పిపెట్టేడు రాజేశ్వరికి.

ఉద్యోగంవస్తే యింటికేం డబ్బు పంపనక్కర లేదనీ, అలాగని వేస్ట్ చేయకుండా కొంత రాజేశ్వరికిచ్చి, మిగిలింది దాచుకొమ్మని కూతురికి సలహా చెప్పి పోయాడు.

రాజేశ్వరికి చదువుకునే రోజులనించీ పరిచయం వున్నవాళ్ళలో శివరాం ఒకడు. ?ను మెడిసిన్‌లో ఆమెకొక ఏడు జూని

యర్. ఇద్దరూ తల్లిదండ్రులు లేనివాళ్ళు కావటం ఒక కారణం. వాళ్ళిద్దరి మధ్యా పరిచయం స్నేహంగా మారటానికి. ప్రస్తుతం ఇద్దరూ ఒకే హాస్పిటల్లో పని చేస్తున్నారు. అయినా పెద్ద హాస్పిటల్ కాబట్టి రోజూ ఒకర్నొకరు కలుస్తూ వుండటం మాత్రం జరగదు.

గాయత్రి పెళ్ళి గూర్చి అనుకోగానే, రాజేశ్వరికి ముందుగా గుర్తొచ్చింది శివరామే! అతనూ తనలాంటి వాడే. ఎవరో దూరపు బంధువులున్నా అప్పుడప్పుడు డబ్బు అడగటమే కానీ ఇతనికి పెళ్ళి పేరంటం చేసే ప్రయత్నాలు చేసే వాళ్ళలాగా లేరు. తన పరిస్థితీ అదే ఎవరో ఒకరు స్నేహితులే పూనుకుని పెళ్ళిళ్ళు చేయాలి తమ లాంటి వ్యక్తులకి — అనుకుంది రాజేశ్వరి.

గాయత్రి చక్కగా, తగినంత ఎత్తు, లావు, మంచి రంగుతో అందంగా వుంటుంది. హైదరాబాదు వచ్చేక మనిషి నడకతీరు మాటతీరు, అలంకరణ అన్నీ మారిపోయి అధునాతనంగా తయారయింది. చదువూ వుంది. శివరామ్‌కీ, తనకీ ఈడు, జోడు బాగుంటుంది.

రాజేశ్వరి ఆలోచనలు ఇంకా క్రియా రూపం దాల్చకముందే, గాయత్రి నాన్న మళ్ళీ ఇంకొక ఉత్తరం రాశాడు కూతురి పెళ్ళి విషయం ఏం చేశావని. 'ఏమయినా సరే ఇవాళ చెప్పాలి శివరామ్‌కి' అని నిర్ణయించుకుని డ్యూటీకి వెళ్ళింది.

ముందుగా అతనున్న ఓ. పి. రూమ్‌కి వెళ్ళి "నీతో కొంచెం మాట్లాడాలి శివరాం" అనడిగింది.

వాళ్ళిద్దరికీ అప్పుడప్పుడు కాకతాళీయంగా కలిసినప్పుడు కాస్సేపు ఏ హోటల్లోనో మాట్లాడుకుని, కాఫీ తాగి విడిపోవటం మామూలే. అయినా, ఎప్పుడూ ఇలా ముందుగా అనుకుని కలుసుకునే అలవాటు లేదు. అందుకని ఆశ్చర్యంగా వుంది శివరామ్‌కి. ఆమె అలా అడగటం

అయినా తన ఫీలింగ్స్ ఏమీ బయటికి తెలియనీయకుండా, "ఓకే.... సాయంత్రం తాజ్ దగ్గర కలుద్దాం" అని ఆమెకి చెప్పేసి హడావిడిలో పడిపోయాడు. అతను పని చేస్తున్నా, మనసంతా సాయంత్రం రాజేశ్వరి ఏమి అడుగుతుందా అనే ఆలోచనే నిండివుంది. నిజం చెప్పాలంటే అతనికి రాజేశ్వరి అంటే భయం. దానిక్కారణం ఆమె గాంభీర్యమే. ఎక్కువగా మాట్లాడదు. తన మనసులో మాట బయటికి రానీయదు. అయితే అతనేది చెప్పినా శ్రద్ధగా విని, స్నేహితురాలిగా సలహా యిస్తుంది తన్నిగూర్చి చెప్పే అలవాటు అసలు లేదామెకి.

అయితే భయంతోపాటు ఆమె అంటే గౌరవమూ, ఎక్కడో కొద్దిగా యిష్టమూ లేకపోలేదు అతనికి. రాజేశ్వరి అతను చూసిన చాలామంది అమ్మాయిలలాంటిది కాదు. తనుచేసే ఉద్యోగానికి తగిన విధంగా డ్రెస్ చేసుకుంటుంది. సాదాగా వుంటుంది. హుందాగా ప్రవర్తిస్తుంది.

సాయంత్రం అయిదు గంటలకి సరిగ్గా శివరామ్, రాజేశ్వరీ కలిసి హోటల్ ఏ.సి. రూమ్‌లో అడుగుపెట్టారు.

"ఇవాళ నేను ప్రత్యేకంగా పిలిచాను కాబట్టి నేనే బిల్ పే చేస్తాను" అని ముందుగానే చెప్పింది రాజేశ్వరి.

"ఏమిటో చాలా విశేషంలాగుందే. ఏం తినిపిస్తావ్ అయితే"

"నీ ఇష్టం."

"ఉహుఁ! బాగా ఆకలిగా వుంది. ఓ యాభయి బిల్ చేసినా ఫరవాలేదు" సరదాగానే అన్నాడు.

"అమ్మయ్య ఉండు చెబుతాను ఇదుగో శివరాం. నా దగ్గర ఇరవయి రూపాయలున్నాయి నీ ఇష్టం మరి."

"అబ్బ! ఊరికే జోక్ చేస్తేనే భయపడిపోతావేం? భలేదానివే నేనేం బకాసురుడ్ననుకున్నావా ఇరవయి, ఏభయి రూపాయల బిల్ చేసేందుకు"

ఇంతలో బేరర్ వస్తే ఆర్డర్ చేయటం అయింది.

పెద్ద హోటల్స్‌లో, ఏ సి. రూమ్స్‌లో ఆర్డర్, సప్లయి చేయటం బాగా ఆలస్యం చేస్తుంటారు. ఇది వచ్చిన వాళ్ళకీ మంచిదే. హాయిగా రెస్ట్ తీసుకుని, కబుర్లు చెప్పుకుని, తర్వాతే తినటం మొదలుపెట్టవచ్చు.

"మీ వాళ్ళు నీ పెళ్ళి గురించి ఏమయినా అనుకుంటున్నారా, ఆ మధ్య మీ బాబయ్య వచ్చి వెళ్ళినట్లున్నారు."

"ఆఁ. ఏవో భూమికొనాలి, వెయ్యి రూపాయలు కావాలని వచ్చాడు."

"ఇచ్చావా?"

"ఊఁ. మన పని అదేగదా!"

".... ......... .... ...."

"ఏం పాపం? నా పెళ్ళి దిగులు నీకు పట్టిందే"

"ఊ! ఎవరికో ఒకరికి పట్టాలిగదా మరి నీకో సంబంధం చూశాను నేను"

"ఎవరబ్బా. నాకు తెలీని, నీకు తెలిసిన ఆ అమ్మాయి?"

"మా కజిన్ సిస్టర్ ఒకమ్మాయి నాతోనే ఉంటోంది అని చెప్పలేదూ, గాయత్రి అని. చక్కగా బంగారు బొమ్మలా ఉంటుంది.... నీకు నచ్చుతుందేమో ఒకసారొచ్చి చూడు. వాళ్ళ నాన్నకి తొందరగా ఉంది పెళ్ళిచేసెయ్యాలని."


".... .... .... ...."

"ఏం శివరాం. ఆలోచనలో పడిపోయావు? మీ వాళ్ళు కట్నం అడుగుతారనేగా? ఫరవాలేదు. కాస్త వున్నవాళ్ళేలే. బాగానే యిస్తారు"

ఇంతలో టిఫిన్లు వచ్చేయి.

శివరాం మాట మార్చేసి, ఏవో ఆసుపత్రి, కేసుల విషయాలు మాట్లాడటం మొదలుపెట్టాడు. కాఫీలు తాగి బయలుదేరేముందు మళ్ళీ అడిగింది రాజేశ్వరి.

"నేనడిగిందానికి జవాబు చెప్పనేలేదు నువ్వు" అని.



"పెళ్ళి పెత్తనం బాగానే చేస్తున్నావు గానీ, ముందుగా నీకు పెళ్ళి అయింటే బాగుండేది. నీకు మీవారు తోడుగా సలహాలిచ్చేందుకు...."

తను అవివాహితురాలయినా, మరొకఅమ్మాయికి సంబంధం చూస్తోంది కానీ, తన పెళ్ళిమాట అతను తెచ్చేసరికి సిగ్గుగా అనిపించింది రాజేశ్వరికి. నోరు విప్పి ఏమీ చెప్పలేకపోయింది

"పో నీ నీ మాట ఎందుక్కాదనాలి. ఎప్పుడు రమ్మంటావు పెళ్ళి చూపులకి. ఒక్కణ్ణే రావాలా? మా వాళ్ళ నెవర్నయినా రమ్మనేదా? అన్నీ వివరంగా చెప్పమరి."

"ఒక్కడివే ఎందుకు? మీ బాబాయికి ఓ ఉత్తరం రాయి ముందుగా. తర్వాత ఏ రోజు వీలుగా వుంటుందో నువ్వే చూసుకుని చెప్పు" అన్నది రాజేశ్వరి.

"అయితే ఓ షరతు. పెళ్ళి చూపులు అన్నట్టు కాకుండా ఊరికే మా ఇంటికొచ్చి వెళ్ళాలి."

"మళ్ళీ ఇదేమిటి."

"అవసంలేలే... తర్వాత చెబుతాను."

* * *

శివరామ్ వస్తానన్న రోజు ఉదయం నించే హడావిడిగా వుంది రాజేశ్వరి. తను నిద్రలేచేసరికి గాయత్రి ఇంకా పడకలోనే వుంది. తనకివాళ ఎనిమిదింటికే వెళ్ళాలిసిన అవసరం ఉంది.

అందుకని గబగబా తయారు అవుతూనే, తలుపులకీ, కిటికీలకీ కర్టెన్లు మార్చింది. పుస్తకాలు, బట్టలూ అన్నీ నీట్‌గా సర్దిపెట్టింది.

వెళ్ళేముందు వంట గదిలో వున్న అవ్వకి వొద్దనుకుంటూనే చెప్పేసింది.

"అవ్వా! సాయంత్ర అయిదింటికి మనింటికి పెళ్ళివారొస్తున్నారు. ఇల్లంతా బాగా తుడిచి ముగ్గులు పెట్టు. మైసూరు పాకం, కారా చేసిపెట్టు. కాస్త శ్రద్ధగా రుచిగా చేయాలి. ఏం? ఇదో ఈ పది ఉంచుకొని. కావలసినవి తెచ్చుకో.... నే వెళ్తున్నా" అనేసి బయలుదేరింది.

గేటుదాకా వెళ్ళాక, "అసలు ముఖ్యమయిన వ్యక్తికే విషయం తెలియకపోతే ఆ అమ్మాయి కాస్తా ఆఫీసులో ఏ పనో పడి ఆలస్యంగా వస్తే. "అమ్మ య్యో ఎలా?" అనిపించి మళ్ళీ ఇంట్లోకి వచ్చి గాయత్రిని నిద్రలేపి. "చూడు గాయత్రీ! సాయంత్రం త్వరగా వచ్చేయి. ఏం? మా ఫ్రెండ్ ఒకరు మనింటికొస్తున్నారు" అని చెప్పి వెళ్ళిపోయింది.

గాయత్రికి నిద్రమత్తులో రాజేశ్వరి ఏం చెపుతున్నదీ వినిపించలేదు. అయినా



అలాగే "ఊఁ" అనేసి మరో పదినిమిషాలు అలాగే నిద్రపోయింది.

ఇక్కడొక తమాషా జరిగింది. రాజేశ్వరి మాటల్ని అవ్వ మరోలాగా అర్థం చేసుకుంది. రాజేశ్వరి ఇంత వయసొచ్చినా పెళ్ళిచేసుకోలేదని, ఆవిడ ఎప్పుడూ బాధపడుతూ ఉంటుంది "ఈ కాలంలో అందరూ ఉద్యోగాలు చేసుకునే అమ్మాయిలు చక్కగా తమకు నచ్చిన వాళ్ళను ఎన్నుకుని ప్రేమించేస్తుంటారు. ఈ పిచ్చిదానికదీ చేత కాదు. తనపనేమో తానేమో అని గంభీరంగా ఉంటుంది ఒక్కతే ఎన్నాళ్ళని ఇలాగే ఉంటుంది" అనుకుంటుంది అవ్వ. అలాంటిదివాళ రాజేశ్వరి "పెళ్ళివారు" అని అంత హడావిడి పడుతోంటే, సంబరపడిపోయింది

ఆ సంతోషాన్ని వెలిబుచ్చేందుకున్నది గాయత్రి ఒక్కతేగన ఆమె నిద్రలేచి ముఖం కడుక్కోగానే కాఫీ యిస్తూ, "ఇవాళ ఆఫీసునుంచి తొందరగా వొచ్చేయమ్మా. అక్కయ్యకి పెళ్ళి వారొస్తున్నారు" అన్నది ముసిముసిగా నవ్వుతూ. అప్పుడు గుర్తొచ్చింది రాజేశ్వరి కూడా వెళ్తూ యెవరో స్నేహితులొస్తారు, త్వరగా రమ్మని చెప్పిన విషయం.

అవ్వకి అంత సంతోషాన్ని కలిగించిన ఈ విషయం గాయత్రిలో మరోలాగ పని చేసింది ఆమె ఆలోచనలో పడిపోయింది. తను యెప్పుడూ వూహించలేదు రాజేశ్వరి పెళ్ళిమాట అసలు తలపెడ్తుందని. అదయినా బొత్తిగా తనతో ఒక్క మాటయినా చెప్పింది కాదు.

పరధ్యానంగానే భోంచేసి ఆఫీసుకి బయలుదేరింది.

తనకి ఇప్పుడిప్పుడే ఉద్యోగం. సిటీ జీవితం బాగా అలవాటు అయినా యి. చేతిలో డబ్బు ఖర్చు చేయటం కూడా వచ్చేసింది. ఇప్పుడు ఈవిడ పెళ్ళయిపోతే నేమిటి?

తనెక్కడుండాలి?

ఈ రెండు గదుల ఇంట్లో తను వాళ్ళతోబాటు ఉండేందుకు వీలవదు. బయట ఎక్కడుండటం? "అసలెక్కడయినా వుంటానన్నా మా నాన్నే మంటాడో. అనేందుకే ముంది. వెంటనే తిరుగు ప్రయాణం కట్టమంటాడు. ఇప్పటికే వదినా వాళ్ళకి కచ్చిగా వుంటుంది నే నిక్కడ సుఖపడిపోతున్నానని. ఇక రాజేశ్వరక్కయ్యకి పెళ్ళని తెలిస్తే. ఉద్యోగం వెలగబెట్టిందిచాలు. బయల్దేరు అంటారు.

అబ్బ. మళ్ళీ ఆ ఊరు వెళ్ళాలంటే జైల్లోకి వెళ్ళినట్లే. ఒక సినిమా నా. షికారా? ఎప్పుడూ ఇంట్లోనే మగ్గిపోవాలి. కాస్త ఇష్టమయిన బట్టలు కొని కట్టుకునే వీలు కూడా వుండదు. పెళ్ళి అంటూ, ఏదో ఒక చచ్చు సంబంధం తెస్తారు నా మెడకి ఉరిలాగా— ఇలా సాగిపోతున్నయి గాయత్రి ఆలోచనలు. ఆవాళ చేస్తున్న పనిలో ఎన్నో తప్పులు దొర్లేయి.

మధ్యాహ్నం మూడు గంటలయేసరికి తలనొప్పి వచ్చేసింది. ఆఫీసర్ని పర్మిషన్ అడిగి ఇంటికి బయలుదేరింది

అవ్వతో స్ట్రాంగ్ కాఫీ చేయించుకుని. ఓ అనాల్జిన్ మాత్ర మింగి కాస్సేపు పడుకొంది

రాజేశ్వరి ఇంటి కొచ్చేసరికి గాయత్రి ఇంకా పడుకునే వుండడం చూసి భయం వేసింది. ఆ రోజుకి సరిగ్గా గాయత్రి నాన్నని రమ్మని ముందుగానే ఉత్తరం రాసింది. కానీ ఆయన పనిమీద వేరే ఊరు వెళుతున్నందున రాలేకపోతున్నానని బాధపడుతూ రాశాడు. అటు ఆయన రాలేదు. ఇటు ఈ పిల్ల ఇలా పడుకొంది. వచ్చే వాళ్ళేమనుకుంటారు? అని ఆదుర్దాపడింది.

"ఏమిటి ఈ వేళప్పుడు పడుకున్నావ్? ఒంట్లో బాగాలేదా?" అని ఆ అమ్మాయి ఒంటిమీద చేయివేసి అడిగింది.

"ఏం లేదక్కా-కాస్త తలనొప్పిగా వుంటేనూ.... ఇప్పుడు కాస్త తగ్గిందిలే."

"ఏదయినా మాత్ర వేసుకున్నావా? యివ్వనా."

"వేసుకునే పడుకున్నాలే."

"అయితే లేచి కాస్త ముఖం కడుక్కొని రెడీ అవమ్మా. బంగారుకదూ? ఇవాళ మనింటికి అతిథులు వస్తున్నారని చెప్పలేదూ?"

ఎలాగో లోలోపల తను పడుతున్న బాధ కనిపించకుండా దాచుకుని ముఖం కడిగి మేకప్ చేసుకుంది. రాజేశ్వరి తనదే పసుపురంగు ప్రింటెడ్ బార్డర్ సిల్కుచీర యిచ్చి. మాచింగ్ బ్లవుజు ఇచ్చి- "ఇవి కట్టుకో" అన్నది.

# "మేస్త్రీ"



నేడు
రచనా రంగంలో శ్రీ
నవలా సౌధపు
మేస్త్రీ
—పర్చా వాసుదేవరావు

మౌనంగా తీసి కట్టుకుంది గాయత్రి. రాజేశ్వరి ఎలా తయారవుతుందా అని చూస్తోంది తను డ్రస్ చేసుకుంటూనే. ప్రత్యేకంగా ఏమీ అలంకారంచేసుకోలేదు. రాజేశ్వరి. మామూలుగా ఏ సినిమాకో వెళ్ళేటప్పుడు లాగానే తయారయింది. "ఏమిటో పెళ్ళి చూపులకి ఇంత సాదాగా తయారయిందే" అని ఆశ్చర్యంవేసినా "ఆవిడ తీరే అంత.నాకెందుకు" అని సరిపెట్టుకుంది గాయత్రి.

శివరాం, వాళ్ళ బాబాయి మాత్రం వచ్చారు అనుకున్న టైముకి. చంటి బిడ్డకు నలతగా వుంటే వాళ్ళ పిన్ని రాలేకపోయిందని చెప్పేడు శివరాం.

గాయత్రికి ఇద్దర్నీ పరిచయం చేసింది రాజేశ్వరి కాస్సేపు మాటలయేక టిఫిను. కాఫీ తెచ్చేందుకు లేచి లోపలికివెళ్ళేరు ఇద్దరూ. ఇలాంటి సమయాల్లో తను ఎదురుగా ఉండటం 'అమంగళం' అని చెప్పి, అవ్వ లోపలే ఉండిపోయింది.

తిరిగి తాము వచ్చేసరికి శివరాం బాబాయి అతన్తో ఏవో గుసగుసగా చెప్పటం, దానికతను చిరునవ్వునవ్వటం గమనించింది రాజేశ్వరి. సంతృప్తి చెందినట్లున్నారు ఫరవాలేదు. అనుకుందిమనసులోనే.

"ఎలా వుంది మా గాయత్రి?" అని అప్పుడే శివరాంని అడిగేయాలని వున్నా తమాయించుకుంది- వాళ్ళ బాబాయి. గాయత్రి ఎదురుగా వుండగా అలా అడగటం బాగుండదని.

మరొక పది నిముషాలకి వీడ్కోలు తీసుకున్నారు వచ్చిన వారు. రాజేశ్వరి. గాయత్రి గుమ్మంలో నిలుచుని వాళ్ళని సాగనంపారు. ఒక్కొక్కరి మనసులో ఒకోరకం ఆలోచనలు మెదులుతున్నాయి. ఎవరూ మనసులో మాట చెప్పుకోలేదు.

"శివరాం ఏం నిర్ణయించుకున్నదీ రేపు చెప్పేస్తాడు" అనుకుని హాయిగా నిద్ర పోయింది రాజేశ్వరి.

గాయత్రి కారాత్రి నిద్ర రావడం అసంభవమే అయింది. "ఎలా ఈ ఆపద నించి తప్పించుకోవాలి? యిన్నేళ్ళు ఉండి ఈవిడ ఇప్పుడే పెళ్ళి చేసుకోవాలా? ఇంకొకటో రెండో ఏళ్ళు ఆగితే. నేనూ నాకు నచ్చినవాణ్ణి ఇక్కడే చూసుకోవచ్చు అప్పుడింక ఆ పల్లెటూరికి వెళ్ళవడే గతి పట్టదు" అని ఎంతసేపో ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చింది.

అయితే ఆ నిర్ణయం ద్వారా. తన స్వార్థం కోసం. ఎంత తప్పు చేస్తున్నదీ మాత్రం గాయత్రి ఆలోచించలేకపోయింది.

అప్పటికప్పుడే పేపర్, పెన్ తెచ్చుకొని టేబుల్ లైటు వెలుగులో రాస్తూ కూర్చుంది.

* * *

తర్వాత మూడు రోజులు శివరాం హాస్పిటల్లో కనిపించలేదు. నాలుగోరోజు ఒకసారి కనిపించినా, రాజేశ్వరిని పలకరించకుండా ముఖం చాటు చేసి వెళ్ళిపోయాడు. రాజేశ్వరి కిదేమిటో అర్థం కావటంలేదు! బిజీగా వున్నాడేమో. ఒకవేళ గాయత్రి నచ్చలేదేమో తనకి. అయినా ఆ మాట చెప్పేయచ్చుగా? ఇలా ముఖం చాటు చెయ్యటం యెందుకు?

అతనికి నారాయణగుడాలో చిన్న క్లినిక్ వుంది. మొదట్లో తననీ కలవమని అడిగేడు ప్రాక్టీసులో. తనకి ఉద్యోగం, ప్రాక్టీసు రెండూ చేసేంత ఇంట్రెస్ట్, ఓపికాలేక రానన్నది. నాలుగురోజులు చూసేక. శివరాం క్లినిక్కి బయలుదేరింది ఒక సాయంత్రం

సాయంత్రం 7 గంటల సమయం. శివరాం పేషంట్లతో బిజీగా ఉన్నాడు. తనే డాక్టరుపని. కాంపౌండరుపనీ, బోయ్‌పనీ కూడా సవ్యసాచిలా చేస్తున్నాడు. పదిమంది దాకా ఉన్నారు పేషెంట్లు. అప్పుడప్పుడు ఒకరు వస్తూనే ఉన్నారు. అతడి పని అయ్యేదాకా డిస్టర్బ్ చేయటం ఇష్టంలేక అతని కెదురుగా వున్న కుర్చీలో మౌనంగా కూర్చొని వీక్లీ తిరగేసింది.

ఏడున్నరకి శివరాం వర్కు అయింది.

"ఇన్నాళ్ళకి నన్ను వెతుక్కుంటూ

నా క్లినిక్‌కి వచ్చేవన్నమాట. చూశావా. పేషంట్లు బాగా వస్తున్నారు. నువ్వూ నాతో కలిసి పనిచెయ్యరాదూ? బాగుంటుంది."

"బాగానే వుంటుంది లేగానీ. ఇలా మొహం తప్పించటం. మాటలు మార్చటం ఎప్పటినించీ నేర్చావు? మా గాయత్రి విషయం ఏం నిర్ణయించేవు?"

డ్రాయర్లోంచి మడత పెట్టిన కాగిత మొకటి తీసి. ఆమెముందు వడేసి. "అది చదువు" అన్నాడు.

డాక్టరుగారికి.

"మీరు సోమవారం సాయంత్రం పెళ్ళి చూపులకి వెళ్ళిన అమ్మాయి. అనగా. డాక్టర్ రాజేశ్వరి గురించి మీకు ముందుగా తెలిసివుంటే మీరు వచ్చి వుండేవారుకాదు. ఆవిడ ప్రవర్తన మంచిది కాదు. దయచేసి ఈ విషయం గుర్తులో ఉంచుకుని ఏ నిర్ణయం చేసుకొనవలయునని కోరుతున్నాను.

ఇట్లు

మీ శ్రేయోభిలాషి"

తల తిరిగినట్లయింది రాజేశ్వరికి. "అసలు శివరాం చూడవచ్చింది గాయత్రిని అయితే. ఇందులో రాజేశ్వరి అని ఉందేం? ఎవరు రాశారిది?"

"ఎవరు రాశారిది?" అని పైకే అనేసింది రాజేశ్వరి

"అదే ముందుగా తెలియాలిసింది"

"మీ యింటి దగ్గర నీకు వరిపోని వాళ్ళెవరో వుంటారు. పెళ్ళిచూపు లనగానే నీకే కాబోలు అనుకుని ఈ పని చేశారు"

"అంతగా నాకు సరిపోని వాళ్ళెవరూ లేరే! అయినా మా అవ్వకి తప్ప- మీ రెందుకొచ్చిందీ తెలీదు. నిజం చెపుతున్నా అసలు గాయత్రికే చెప్పలేదు నేను-తనని చూడటానికి వచ్చేరని."

"అదేమిటి? ఎందుకు చెప్పలేదు. నువ్వారోజు పెళ్ళి చూపుల్లా కాకుంటే మామూలుగా రావాలనివుంటే సరదాగా అన్నావనుకున్నాను. ఎందుకంత రహస్యం?"

"మరేంలేదు పెళ్ళి అనగానే నా కొద్దు మొర్రో అని గొడవచేస్తుందిట ఆ పిల్ల. అందుకని తతంగం అంతా అవనీ, నీకు నచ్చితేఅప్పుడు చెప్దాంఅనుకున్నాను"

"మంచిదానివే అవ్వకు తెలుసుగా ఆ అమ్మాయికి చెప్పిందేమో?"

"చెప్పినా నాకు పెళ్ళి చూపులని ఎందుకు చెప్తుతుంది" ఈ విషయాన్నిలా చర్చించాల్సివచ్చినందుకే సిగ్గుగా వుంది రాజేశ్వరికి.

"నువ్వసలు ఏం చెప్పావో ఆ అవ్వ ఏమని అర్థం చేసుకుందో... .... నువ్వు చెప్పేదే నిజమయితే అవ్వకి తప్ప ఇంటి దగ్గర ఇంకెవ్వరికీ ఈ విషయం తెలీదు ఆ ముసలామెకి తెలిశాక ఇంట్లోనేవున్న గాయత్రికి తెలియకుండా వుంటుందా విషయాన్ని?"

"ఆతను చెప్పబోతున్నదీ అర్థం అయీ కానట్లుంది రాజేశ్వరికి.

"అయితే నువ్వంటున్న దేమిటి?"

"అనేందుకేం లేదు. ఉత్తరం రాసిన కాగితం చూడు. బాగా గమనించు ఇదుగో ఈ మూలగా 'సీనా' అన్న అక్షరాలు లేవూ. ఇది డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ కాగితం. ఇది మీ ఇంటినించే అంటే ఆ గాయత్రే రాసిందేమో అనిపిస్తోంది నాకు. చేతివ్రాత యిలాగే వుంటుందా ఆ అమ్మాయిది?"

తను బయల్దేరేముందే గాయత్రి ఒక కార్డు వాళ్ళ నాన్నకి రాసి తనకిచ్చింది పోస్ట్‌చేయమని తను మర్చిపోయింది పోస్ట్ చేయటం! అదిగుర్తొచ్చి బాగ్‌లో వెతికింది.

దాన్నితీసి రెండిట్నీ పోల్చిచూస్తే. బాగా కనిపిస్తోంది పోలిక.

"చూశావా? అందంగా ఉంది-బుద్ధి మంతురాలు-చూసివెళ్ళు అన్నావు నీమాట కాదనలేక వచ్చాను. ఆ పిల్ల నీకే ఎసరు పెట్టాలని చూసింది"

"అయినా అక్కాచెల్లెళ్ళలాగా ఉన్నామే. గాయత్రి ఎందుకిలా చేసుంటుంది? నాకేమిటో నమ్మబుద్ధి కావటంలేదు"

"అలా అని నువ్వనుకుంటున్నావ్. నీకు పెళ్ళయి సుఖంగా ఉండటం ఆ పిల్లకిష్టం లేదేమో ఎవరికి తెలుసు?"

"పోన్లే శివరాం నువ్వు చూడవచ్చింది ఆ పిల్లని కదా! ఆ ఉత్తరం గురించి వర్రీ అవటం యెందుకు? మా గాయత్రి నీకు నచ్చిందా, లేదా చెప్పు ముందు"

"ఇంకాస్సేపు ఇలాగే మాట్లాడేవంటే నేనేం చేస్తానో నాకే తెలీదు. అసలీమ్నకేమయినా బుద్ధివుందా అని? నాకొచ్చిందల్లా... నీకొచ్చింది నువ్‌గాని, నీ మీద అవవాదులు రాసి పోస్తున్న ఆ రాక్షసిపిల్ల కావని అర్థం చేసుకోవేం?

"శివరాం? ఏమిటి నువ్వంటున్నది" రాజేశ్వరిమాటలు నూతిలోంచి వచ్చినట్లుగా వున్నయి

"ఏం పెళ్ళి పెటాకులు నాకేగాని. నువ్వు చేసుకోవా? జీవితాంతం ఇలాగే వుండిపోతావా? లేకపోతే నీకు నేను తగనా? ఏమిటి నీ సందేహం. ఇన్నాళ్ళుగా స్నేహం చేశాం. ఎందుకు? నీ మనసులో ఏముందో నాకు తెలీదు. నువ్వంటే నాకెంత ఇష్టమో నీకు తెలీదు"

"మనిద్దరి వయసులూ.... ...."

"ఓహో అదా నీ సందేహం? నీకు చదువులో ఒక ఏడు జూనియర్ని అయినా వయసులో ఆర్నెల్లు పెద్దవాణ్ణేలే. నా డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తెమ్మంటావా ఏం?"

"అబ్బ! ఉండు శివరాం. నీకంతా తొందరే. ఇంత హఠాత్తుగా నువ్విలా మాట్లాడుతూంటే. నాకు పిచ్చెక్కినట్లుగా ఉంది. బుర్ర అసలు పని చేయటంలేదు"

"తొందర పెట్టకపోతే, నీ మనసేమిటో నువ్వే అర్థం చేసుకోలేకుండా పెద్ద ఆరిం



దాలా నాకు పెళ్ళి చేస్తానంటావ్ నువ్వు. అందుకే....”

*　　*　　*

ఇంట్లో రాజేశ్వరీ గాయత్రీ ఏమీ జరగనట్లుగా మామూలుగానే ప్రవర్తిస్తున్నారు.

ఒక రోజు అవ్వ అడిగేసింది “డాక్టరమ్మా ఆ రోజు నిన్ను చూసి వెళ్ళేరుగా వాళ్ళేమయినా కబురు రాశారేమిటి,” అనడిగింది. దాంతో శివరాం చెప్పింది నిజమేనని అర్థం అయింది రాజేశ్వరికి. అదీకాకుండా తను అవ్వకేం జవాబు చెబుతుందో వినాలని వున్నట్లుగా గాయత్రి నిలుచుని వుండటమూ గమనించింది!

ఆ వేళ గాయత్రి నాన్న ఉత్తరం రాశారు రాజేశ్వరి పేరున. గాయత్రి ముందుగా ఇంటికొచ్చింది. ఉత్తరం తీసి చదివి నివ్వెరబోయింది.

“చిరంజీవి రాజేశ్వరమ్మ!

మీ బాబాయి ఆశీర్వదించి వ్రాయుచున్న ఉత్తరం. ఇక్కడ అంతా క్షేమం. ఆ మధ్య గాయత్రిని చూడవచ్చిన పెళ్ళివారేమీ కబురు చేయలేదని రాశావు. కబురేదయినా ఉంటే ఇంత ఆలస్యం ఎందుకు చేస్తారు మన పిల్ల వాళ్ళకి నచ్చలేదేమో! పోనీలే అమ్మా. మేం ఇక్కడ దానికి ఒకటీ రెండు సంబంధాలు చూశాం.

త్వరలో నీ వివాహం అన్న వార్త నాకు ఎంత సంతోషాన్ని కలిగించిందో చెప్పలేను. ఈ సమయంలో మీ నాన్నగారయిన, నా స్నేహితుడే ఉంటే ఎంత ఆనందించునో. నేను వచ్చే వారంలో అక్కడికి వస్తున్నాను. అప్పుడు అన్ని వివరాలు తెలుసుకుంటాను. నేను చేయగల కార్యం ఏమయినా వున్నచో నిస్సందేహంగా చెప్పేయి. సంతోషంగా చేస్తాను. మా గాయత్రిని యిన్ని రోజులూ, స్వంత చెల్లిగా చూసుకున్న నీ మేలు మరువలేను. ఆ ఉద్యోగానికి రాజీనామా యిచ్చి తయారుగా వుండమని దానికి చెప్పు.

నేను వచ్చినప్పుడు వెంట తీసుకు వెళతాను.

మీ కిద్దరికీ నా ఆశీర్వాదములు. అవ్వగారికి నమస్కారాలు తెలుపు.

ఇట్లు
మీ బాబాయి, శంకరయ్య.”

అని వుంది ఉత్తరంలో.

పిచ్చిదానిలా, ఉత్తరాన్ని పదేపదే చదువుతూ వుండిపోయింది గాయత్రి. ●

కార్టూన్లు వేయడం
పోస్టుద్వారా నేర్చుకోండి.
వివరములకు 50 పై॥ స్టాంపులతో
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్టూనింగ్
కంచరపాలెం
విశాఖపట్నం-530 008

వాడని మల్లెలు
మీ అభిమానానికి రుజువులు... ముళ్ళపూడి రచనలు

| | | | |
|---|---|---|---|
| నవ్వితే నవ్వండి-2 ........ | ప్రథమ | ముద్రణ | 6.50 |
| భగ్నవీణలూ బాష్పకణాలూ ........ | రెండవ | ″ | 8.00 |
| 80 రోజుల్లో భూప్రదక్షిణం ....... | ″ | ″ | 15.00 |
| విక్రమార్కుడి మార్కు సింహాసనం.. | మూడవ | ″ | 12.00 |
| బుడుగు-2 ........ | ″ | ″ | 10.00 |
| రాజకీయ బేతాళ పంచవింశతిక.. | ఐదవ | ″ | అచ్చులో... |
| జనతా ఎక్స్‌ప్రెస్ ........ | ″ | ″ | 5.50 |
| బుడుగు-1 ........ | ″ | ″ | 10.00 |
| గిరీశం లెక్చర్లు ........ | ″ | ″ | 5.50 |
| ఇద్దరమ్మాయిలూ-ముగ్గురబ్బాయిలూ... | ఆరవ | ″ | 4.50 |
| రాధాగోపాలం ........ | ″ | ″ | 6.00 |
| ఋణానందలహరి ........ | ఏడవ | ″ | 7.00 |
| నవ్వితే నవ్వండి-1 ........ | ″ | ″ | 6.00 |

పుస్తకాల ఖరీదులో రెండు రూపాయలు తగ్గించి ముందుగా M.O పంపితే పోస్టు ఖర్చులు మేమే భరించి రెండు రూ॥లకే వి.పి.పోస్టులో పంపగలము.

నవోదయ పబ్లిషర్స్ విజయవాడ-2 గుంటూరు-2